క్లుప్తంగా

గృహ మిత్ర పథకం బహుమతులు అందజేత



బహుమతులను అందిస్తున్న హెచ్‌పీ గ్యాస్ సేల్స్ అధికారులు

చీమకుర్తి: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో గృహ మిత్ర పథకం ద్వారా గ్యాస్ లబ్ధిదారులకు జిల్లా మొత్తం మీద 5 బహుమతులను ఇవ్వగా వాటిలో రెండు, మూడో బహుమతులు చీమకుర్తి మండల వాసులు గెలుచుకున్నారు. గురువారం చీమకుర్తిలోని శ్రీసాయినాథ్ గ్యాస్ ఏజెన్సీవారి ఆధ్వర్యంలో రెండో బహుమతిని గెలుచుకున్న చంద్రపాడుకు చెందిన బి.సుబ్బరామిరెడ్డికి సెల్‌ఫోన్, మూడో బహుమతిని గెలుచుకున్న మువ్వవారిపాలెంకు చెందిన బక్కా కుమారికి ఎలక్ట్రిక్ ఓవెన్‌ను హెచ్‌పీసీఎల్ నెల్లూరు ఏరియా సేల్స్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.మనోజ్ కుమార్ చేతుల మీదుగా అందించారు. నిర్వాహకురాలు స్వర్ణలత, కె.శేషారావు పాల్గొన్నారు.

జీవనోపాధుల మెరుగు కోసం ఆర్థిక సాయం



వేరు శనగ నూనె మిల్లును తనిఖీ చేస్తున్న సెర్ప్ అధికారులు

కొత్తపట్నం: డ్వాక్రా మహిళలు జీవనోపాధులు మెరుగు పర్చుకోవడానికి యూనిట్స్‌ల కోసం ఆర్థిక సహాయం చేస్తామని సెర్ప్ డైరెక్టర్ కేశవ్ అన్నారు. గురువారం మండలంలో సెర్ప్ అధికారులు పర్యటించారు. పీఎంఎఫ్ఎంఈ యూనిట్స్ నుంచి మంజూరు చేసిన నూనె మిషన్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పీఎంఎఫ్ఎంఈ యూనిట్స్ కింద కారం మిషన్‌లు, తడిపిండి, పొడి పిండి మిషన్లు, నూడుల్స్ మిషన్, పేపర్ ప్లేట్స్ తయారు చేసే మిషన్ సెంట్రింగ్, చెక్క వంటివి పెట్టుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఇవి పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ రూ.35 వేలు సబ్సిడీ ఇస్తామని తెలిపారు. అనంతరం ఈతముక్కలలో ఎస్టీ ప్రకాశం కాలనీలో మహిళలకు జీవనోపాధుల గురించి అవగాహన కల్పించారు. రాజా ప్రతాప్, డీపీఎం డేవిడ్ సుబ్బారావు, ఏపీఎం రజియా సుల్తాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలతో మేలు



పీహెచ్ సెంటర్‌లో బ్లెడ్ టెస్ట్, యూరిన్ టెస్టు మిషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి

కొత్తపట్నం: పల్లె ప్రజలకు సాంకేతక పరమైన సేవలు అందించేందుకు కొత్తగా బ్లెడ్ టెస్ట్, యూరిన్ టెస్ట్ మిషన్ కొత్తవి మంజూరయ్యాయని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యాన్ని డాక్టర్ వైష్ణవిను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మాట్లాడుతూ నాడు-నేడు ద్వార హాస్పిటల్‌ను ఆధునికరణ చేసిన తరువాత రోజుకు 70 నుంచి 80 మంది రోగులు చూపించుకుంటున్నారని, డెలివరీ కేసులు కూడా పెరిగాయన్నారు. ఒంగోలు ప్రాంతాలకు వెళ్లకుండా హాస్పిటల్‌లోనే పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు కూచిపూడి చరత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనాఋషి దేవస్థాన ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి వారి 19వ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రధాన కార్యదర్శి జీవీ సుబ్బారావు గురువారం తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి



సమావేశానికి హాజరైన అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

- తాగు నీరు, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై చర్చ
- రూ.20 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా ఇళ్లకు కుళాయిలు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అంజిరెడ్డి

కొత్తపట్నం: నిధులు వెనుక్కు పోకుండా మండల స్థాయి అధికారులకు అందుబాటులో ఉంటూ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధికారులను కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా 26 వర్కులకు గాను రూ. 7 కోట్లు మంజూరైన రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు పంచాయతీ తీర్మానాలు రాలేదని పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు నియోజకవర్గంలోని కొత్తపట్నం మండలానికి రూ.20 కోట్లు నిధులు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంజూరు చేయిస్తే అధికారులు పనులు నత్తనడకన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. గ్రావెల్ రోడ్లు రెండు వేశారని అవి పూర్తిగా నగదు కాంట్రాక్టర్‌కు పడితే 170 గ్రావెల్ రోడ్లు వేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులు వేసిన రోడ్లుకు బిల్లులు త్వరగా పంపించి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో పి.సుజాత మాట్లాడుతూ మంజూరైన వర్కులకు పంచాయతీ తీర్మానాలు వెంటనే ఇవ్వకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శిలను హెచ్చరించారు. ఏడు రిజిస్టర్లు పంచాయతీల్లో పెట్టాలా, లేదా అని చర్చి జరిగింది. దానిని జిల్లా స్థాయి అధికారుల సలహా అడిగి రిజిస్టర్లు పెట్టే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా సమావేశాన్ని రెండు శాఖలతో ముగించారు. జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీ శారద, పీఆర్ ఏఈ శేషగిరిరావు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో రత్నజ్యోత్స్న, ఏపీఎం రజియా సుల్తాన్ బేగం, డాక్టర్ వైష్ణవి, అనూష, డాక్టర్ శివపార్వతి, ఎఫ్‌డీవో, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఉప్పు రైతులు

ఉప్పు రవాణాలకు అనుమతులు ఇవ్వాలి

ఉప్పు రవాణాకు గాను అప్రోచ్ రోడ్డుకు ఆర్అండ్‌బీ అధికారులు అనుమతులు ఇవ్వాలని ఉప్పు రైతులు గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీడీవో పి.సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పు రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 1204లో అప్పుడు భూగర్భ గనులు శాఖ మంత్రిగా ఉన్నప్పుడు బాలినేని శ్రీనివాసరెడ్డి 100 మందికి 150 ఎకరాలు అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఒక్కోరికి 1-50 ఎకరాల చొప్పును పట్టాలు మంజూరు చేశారని, అప్పటి నుంచి సాగుబడి చేసుకుని జీవనం గడుపుతున్నామన్నారు. అంతా చిన్నా సన్నకారు రైతులేనని ఇప్పుడు బకింగ్‌హాం బ్రిడ్జి నిర్మించిన తరువాత అప్రోచ్ రోడ్డు శిథిలమయిందని, ఉప్పు రవాణా చేసుకోవడానికి మరో మార్గం లేదని విన్నవించుకున్నారు. అప్రోచ్ రోడ్డు లేకపోతే 500 మందికి ఉపాధి కోల్పోతామని అప్రోచ్ రోడ్డు వెంటనే ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆర్అండ్‌బీ అధికారులు అనుమతులు ఇస్తే అప్రోచ్ రోడ్డు వేయటానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆర్అండ్‌బీ అధికారులకు లెటర్ పంపించాలని ఎంపీడీవో సుజాతను ఆదేశించారు. ఉప్పు రైతులు పురిణి సురేష్, కాపు శ్రీను, కుంతూరి నాంచార్లు, పిచ్చియ్య, తంబి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పొటాష్‌లో యూరియా?

పొటాష్‌లో యూరియా వచ్చిందని ఓ రైతు మండల సర్వసభ్య సమావేశంలో పొటాష్ బ్యాగ్ తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేయడంతో అధికారులు, ప్రజా ప్రతినిధుల అవాక్కయ్యారు. మోటుమాల గ్రామానికి చెందిన కోడూరి కోటేశ్వరరావు కొత్తపట్నంలో షా ఎంటర్‌ప్రైజస్ షాపులో 28-1-2023న 50 కేజీల పొటాష్‌ను రూ.1,700 వ్యయంతో కొనుగోలు చేశాడు. గురువారం బ్యాగ్‌ను ఓపన్ చేసి పైరుకు వాడుతుండగా అనుమానం వచ్చి పరిశీలించాడు. తోటి రైతులందను పిలిపించి ఇందులో యూనియా శాతం ఎక్కువగా ఉందని చర్చించాడు. వెంటనే సర్వసభ్య సమావేశంలో తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశాడు. పొటాష్‌లో యూరియా కలిసిందని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సుజాత సమక్షంలో బ్యాగ్‌ను ఓపన్ చేసి చూపించాడు. దీంతో షాపులకెళ్లి పరీక్షలు చేయించాలని అంజిరెడ్డి, రవీంద్రరెడ్డి ఆదేశించారు. ఏవో షా ఎంటర్‌ప్రైజెస్ షాపుకెళ్లి పరిశీలించగా ఐపీఎల్ కంపెనీకి సంబంధించిన ఆ బ్యాచ్ లేదని, శుక్రవారం ఉదయం శాంప్లింగ్ తీస్తామని చెప్పారు. యూనియా కలిసి ఉంటే షాపుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు.

25 సేవలకు తగ్గకుండా అందించాలి



పార్కులో వ్యాయామ పరికరాలను పరిశీలిస్తూ..



నిర్మల్ నగర్ వార్డు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని వార్డు సచివాలయాల్లో సిబ్బంది ప్రతి రోజూ 25 సేవలకు తగ్గకుండా ప్రజలకు సేవలు అందించాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సిబ్బంది ఆదేశించారు. నిర్మల్ నగర్, లాయరు పేట వార్డు సచివాలయాలను గురువారం సందర్శించారు. రెండు సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కరెంటు బిల్లులు, లామినేషన్ సర్వీసెస్, ప్రాపర్టీ, వాటర్ ట్యాక్స్, బర్త్ అండ్ డెత్ సరిఫికెట్లు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు సకాలంలో అందించాలన్నారు. ఇలాంటి సేవలు రోజుకు 25కు తగ్గకుండా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఏకరూపు దుస్తులు తప్పనిసరిగా ధరించాలన్నారు. పీఎం-జేఏవై సర్వే పురోగతి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం కలెక్టర్ నిర్వహించే వీక్షణ సమావేశంలో పీఎం జేఏవై సర్వే పరోగతి గురించి ఆరా తీస్తున్నారన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు కానీ పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, కుళాయి పన్ను గురించి ప్రత్యేకంగా సచివాలయ సిబ్బంది, నగర పాలక సంస్థ రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. నిర్మల్ నగర్ సచివాలయ పరిధిలో మొత్తం డిమాండ్ షుమారు రూ. 1.12 కోట్లు డిమాండ్ ఉండగా రూ. 78 లక్షలు వసూలు చేశారన్నారు. ఇంకా రూ. 34 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ గాంధీ పార్కు, రంగారాయుడు చెరువు, నిర్మల్ నగర్ లలోని పార్కులను పరిశీలించారు. పార్కులలో ఉన్న వ్యాయామ పరికరాలను పరిశీలించారు. డివిజన్ కార్పొరేటర్ ఢాక సుజాత హనుమారెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు గణపతి, పద్మజ, బాల కోటయ్య, చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబ్జితో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

చీమకుర్తి: బీసీ జనాభా కుల గణన చేపట్టాలని బీసీ కులాల సంఘం నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం చీమకుర్తిలోని బీసీ సంఘం కార్యాలయంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా బీసీ కులాలకు కుల గణన చేపట్టకపోవడం వలన జనాభా దామాషా ప్రకారం రావాలసిన హక్కులు, రిజర్వేషన్‌లను కోల్పోతున్నట్లు వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న 8 శాతం మందికి 10 శాతం రిజర్వేషన్‌లు ఇచ్చారని, 54 శాతం ఉన్న బీసీలకు మాత్రం 27 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ.. బీసీ అని చెప్పుకుంటూ గత ఏడెమిది సంవత్సరాల నుంచి ఆయన బీసీలకు చేసిందేమి లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా బీసీల కుల గణన చేపట్టి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా తమ నిరసనలు చేపడతామని హెచ్చరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్రపు రాఘవరావు, మర్రి లక్ష్మీనారాయణ, బత్తుల మల్లికార్జున, ఎస్.హరిప్రసాద్, డి.పుల్లయ్య, స్థానికులు పాల్గొన్నారు.

పేస్ కాలేజీలో మెడిటేషన్‌పై అవగాహన



మెమెంటో అందిస్తున్న పేస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో మెడిటేషన్‌పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. హర్ ఘర్ కా ధ్యాన్‌హై అనే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ క్రాంతి యర్రంశెట్టి హాజరయ్యారు. బీటెక్ ఆధ్వర్యంలో మెడిటేషన్ ఎలా చేయాలి, ఎందుకు చేయాలి, దాని వల్ల కలిగే ప్రయోజనాలను బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులకు వివరించారు. ఏకాగ్రత పెరగడం, నియంత్రణ శక్తిని కలిగి ఉండడం, దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టుటకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి తిరునాళ్లకు సిద్ధం



సోపిరాలలోని రామకోటేశ్వర దేవస్థానం



రామకోటేశ్వరస్వామి మూలవిరాట్

- పోటాపోటీగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు

చినగంజాం: మహాశివరాత్రి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించుకునేందుకు మండలంలోని రెండు శైవ క్షేత్రాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాఘ కృష్ణ చతుర్దశి నాడు వచ్చే మహాశివరాత్రి పండుగను హిందువులందరూ ఘనంగా జరుపుకుంటారు. హిందువులంతా సంక్రాంతి అతి పెద్ద పండుగగా జరుపుకునే ఆనవాయితీ కాగా చినగంజాం మండలంలో శివరాత్రి అతిపెద్ద పండుగగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీలోని బాలకోటేశ్వర స్వామి ఆలయం, చినగంజాం పంచాయతీలోని సోపిరాల గ్రామంలో రామకోటేశ్వస్వామి ఆలయంలో ప్రతి ఏడాది శివరాత్రి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన గుంటూరు జిల్లా కోటప్పకొండ తరువాత జిల్లాలోని చినగంజాం మండలంలో శివరాత్రి తిరునాళ్ల అంతటి ప్రసిద్ధి పొందింది. శైవ క్షేత్రాల్లో శ్రీశైలం, మహానంది, కోటప్పకొండ, అమరావతి మొదలగు పుణ్యక్షేత్రాలతో పాటు చిన్న కోటప్పకొండగా పిలువబడే మహిమ గల దేవాలయం బాలకోటేశ్వరస్వామి దేవాలయం చినగంజాం మండలంలో నిదే. కొత్తపాలెం పంచాయతీలో 101 శివలింగాలతో బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ఉండగా, దేవాలయానికి 400 ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. జిల్లాలో శివరాత్రి పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రాంతాల్లో చినగంజానికి ప్రత్యేక స్థానం ఉంది. శనివారం మహా శివరాత్రి పండుగను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రెండు దేవాలయాల ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లు చేశాయి. శివరాత్రికి సుమారు కోటి రూపాయిలుపైగా వెచ్చించి నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్తపాలెం పంచాయతీలోని బాలకోటేశ్వర స్వామి ఆలయానికి పూర్వ చరిత్ర ఉంది. దేవాలయంలోని బాలకోటేశ్వరుడు స్వయంభు లింగం కాగా భక్తులు కోర్కెలను తీర్చే స్వామిగా ఆయనకు ప్రజలలో ప్రగాఢ విశ్వాసం ఉంది.

నేటి నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

మడనూరు (కొత్తపట్నం): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎండోమెంట్ ఈవో జి.రమణారెడ్డి తెలిపారు. 17 రాత్రి 9 గంటలకు అంకురార్పణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18 తెల్లవారు జామున 5 గంటలకు మహాశివరాత్రి ప్రత్యేక అభిషేకాలు, రాత్రి 12 గంటలకు స్వామి వారికి లింగోద్భవ, 19న ఉదయం 5 గంటలకు శ్రీ రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వాములకు కల్యాణోత్సం జరుగుతుంది. రాత్రి 10 గంటలకు నాలుగుదేవృక్ష గ్రామోత్సవం, 20న సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఈతముక్కల వెళ్లి, 21న ఈతముక్కల నుంచి రథోత్సవం ప్రారంభమై మడనూరు పాదుకు చేరుతుంది.

ఆత్మజ్యోతిని వెలిగించే మహాశివరాత్రి

- బ్రహ్మకుమారి రాజయోగిని మాధవి



ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

ఒంగోలు టౌన్: ఆత్మజ్యోతిని పరంజ్యోతిలో వెలిగించడమే మహాశివరాత్రి పర్వదిన విశేషమని బ్రహ్మకుమారి రాజయోగిని మాధవి చెప్పారు. నగరంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారీలచే గురువారం ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయోగిని మాధవి మహాశివరాత్రి ప్రత్యేకత, పండుగ ఉద్దేశాన్ని వివరించారు. పరమాత్ముని సమీపంలో నివసించడమే ఉపవాసం అని, ఆత్మలోని విషయవికారాలు అనే చీకటిని పారదోలడమే జాగరణ అని విశ్లేషించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్, నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటరమణ, పలువురు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఘనంగా హోమ మహోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: మహాశివరాత్రి పురస్కరించుకుని నగరంలోని కేశవస్వామి పేటలో వేంచేసియున్న శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో పంచాయతన హోమ మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. రెండోరోజు గణపతి పూజ, మహా మాడపారాధన, రుద్రాభిషేకం, కుంకుమార్చన, రుద్రహోమం జరిగింది. దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు దంపతులు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు ఈమని మదన్ మోహన్, న్యాయవాది ఐ.సుబ్బారావు, అర్చకస్వాములు ప్రసాద్ శాస్త్రి, రామకృష్ణ పాల్గొన్నారు.

తెలుగు జాతి కీర్తి పెంచిన శ్రీకృష్ణ దేవరాయలు



కృష్ణ దేవరాయలు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సేవా సంస్థ



సంతవేలూరిని సత్కరిస్తున్న ప్రరసం

ఒంగోలు టౌన్: తెలుగు భాషకు, తెలుగు జాతికి విశిష్ట ఖ్యాతిని తీసుకొనివచ్చిన శ్రీకృష్ణ దేవరాయలకు స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు అన్నారు. గురువారం నగరంలోని గాంధీ పార్కు వద్ద శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఘనంగా నిర్వహించారు. రాయలవారి స్ఫూర్తితో తెలుగుభాష పూర్వ వైభవం కోసం పునరంకితం అవుదామని ఆయన పిలుపునిచ్చారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయడమే అయనకు నిజమైన నివాళి అవుతుందన్నారు. ఒక రాజుగా చేసిన ప్రతి యుద్ధంలో విజయపతాకాన్ని ఎగరేసిన శ్రీకృష్ణ దేవరాయలు, విరామ సమయంలో సాహితీ గోష్ఠులతో గడపడం గొప్ప విషయమని శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గుర్నాధరావు కొనియాడారు. అనంతరం ఒంగోలు నగరంలో త్యాగమయ్య, అన్నమయ్య,కృష్ణ దేవరాయలు, తెలుగుతల్లి విగ్రహాలను ప్రతిష్ఠించిన డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావును కళానిధి బిరుదుతో సత్కరించారు. మిడసల మల్లికార్జునరావు, కనకమాల రాఘవరావు, జి.ఓబుల్ రెడ్డి, డా.నూనె అంకమరావు, షేకఖ మహబూబ్ జాన్, పి.గోవర్ధన్ రెడ్డి,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో..

ప్రజారంజకంగా రాజ్యాన్ని పరిపాలించిన మహారాజుగానే కాకుండా కవితా సామ్రాజ్యాన్ని ఏలిన కవిరాజుగా ప్రజల హృదయాలను గెలిచిన సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు అని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు శ్రీనివాసులు శ్లాఘించారు. లాయరుపేటలోని కృష్ణదేవరాయలు విగ్రహం వద్ద జయంతిని నిర్వహించారు. అముక్తమాల్యాద గ్రంథాన్ని రచించన కృష్ణదేవరాయలు తెలుగుజాతికి వెలలేని బహుమతినిచ్చారన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలో మహామహుల విగ్రహాలను ఏర్పాటు చేయడానికి తీవ్రమైన కృషి చేసిన డాక్టర్ సంగవేలూరి కోటేశ్వరరావుకు మహర్షి అనే బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో కె.ఎస్.వి ప్రసాద్, కల్లగుంట కృష్ణయ్య, వనగపల్ల సుబ్బారావు, మామూర్తి, మద్దులూరి శ్రీనివాసరావు, న్యాయవాది రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.